క్లుప్తంగా

రాళ్లదాడి టీడీపీ నాయకుల కుట్ర



నర్సంపేట : ఏపీ సీఎం జగన్ హత్యకు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కుట్ర చేస్తున్నారని ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, జిల్లా నాయకుడు నాడెం శాంతికుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ఏపీ సీఎం జగన్ పాటుపడుతూ జనరంజక పాలన సాగిస్తుండగా టీడీపీ అధినేతలు ఓర్వలేక కుట్ర చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌ను రాళ్లతో కొట్టాలని చంద్రబాబు, అంతం చేయాలని పవన్ కల్యాణ్ విద్రోహ శక్తులను రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఏపీ ప్రజలే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

దాడి హేయం

రాయపర్తి : ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి హేయమని టీజేఎస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దర్గయ్యనాయక్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. దాడిపై కేంద్ర ఎన్నికల సంఘం లోతైన దర్యాప్తు చేపట్టి బాధ్యులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్య తీసుకోవాలని కోరారు. దాడులు అప్రజాస్వామికమని చెప్పారు. అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

నల్లబెల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని నారక్కపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం .. నారక్కపేటకు చెందిన ముస్కు ఆదిరెడ్డి తన భార్య రాధమ్మ (75) ద్విచక్రవాహనంపై ఈనెల 4న నర్సంపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా రాధమ్మ చీర కొంగు ద్విచక్ర వాహణ చక్రంలో చిక్కుకుని వాహనం అదుపు తప్పి కింద పడిపోయింది. గాయాలపాలైన ఇద్దరినీ కుటుంబీకులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తదనంతరం మెరుగైన వైద్యం కోసం రాధమ్మను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నివాళి



నర్సంపేట : నర్సంపేటకు చెందిన యూత్ సభ్యుడు సంపంగి వెంకటేశ్ ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని జేతురాంతండాకు చెందిన గుగులోతు హుస్సేన్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. హుస్సేన్ మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నేతావత్ వీరూ, మచ్చ రమేశ్, గుగులోతు స్వప్న, విజయ్‌నాయక్, మహమూద్, అఫ్రోజ్, గారె భిక్షపతి, భాస్కర్, నర్సింహారెడ్డి, గుగులోతు యాకూబ్, కోతి వీరన్న, ఉస్మాన్, ఫిరోజ్, రామ కృష్ణ, వినీత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన చిక్కుడు అక్షయ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆమె తండ్రి శ్యామ్‌కు అతడి స్నేహితులు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత శ్యామ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో శ్యామ్ స్నేహితులు చొప్పెర చంద్రమౌళి, మధుకర్, శ్రీనివాస్, నల్లతీగల శేఖర్, ఏదునూరి రాజు, బేతి కరుణాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, గాజు సుధాకర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



నర్సంపేట రూరల్ : నివాళులర్పిస్తున్న డాక్టర్ గోపాల్



రాయపర్తి : నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



నర్సంపేట : నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



అంబేడ్కర్‌కు ఘననివాళి



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, రాయపర్తి, ఖానాపురం, పర్వతగిరి, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, సంగెం, గీసుకొండ మండలాల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, ఇతర రాజకీయ పార్టీల, విద్యార్థి, ఉద్యోగ, కుల సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నర్సంపేట : పూలమాల వేస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి



సంగెం : పూలమాల వేస్తున్న తహసీల్దార్



నల్లబెల్లి : పూలమాల వేస్తున్న తడుక అశోక్ గౌడ్



నెక్కొండ : పూలమాల వేస్తున్న రంజిత్‌రెడ్డి



ఖానాపురం : నివాళులర్పిస్తున్న నాయకులు



పర్వతగిరి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దుగ్గొండి: పూలమాల వేస్తున్న శ్రీనివాసరెడ్డి



చెన్నారావుపేట : కేక్ కట్ చేస్తున్న నాయకులు



గీసుకొండ:ధర్మారంలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, నాయకులు



గీసుకొండ : మొగిలిచర్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



సంగెం : పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్సంపేట : పూలమాల వేస్తున్న రవీందర్‌రావు

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భద్రయ్య

వర్ధన్నపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను చాలా వరకు నివారించొచ్చని అగ్నిమాపక అధికారి వి.భద్రయ్య తెలిపారు. మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక దళ వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 20 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రజలకు ప్రమాదాలు, నివారణ కోసం తీసుకోవాలిన్సన జాగ్రత్తలపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే నివారణ చర్యలు చేపట్టడంతోపాటు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. తొలుత 1944లో అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 66 మంది సిబ్బందికి నివాళులర్పించారు. వారోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

రాజకీయ లబ్ధి కోసమే దొంగ జీఓలు

ఖానాపురం : శాసనసభ ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసమే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దొంగ జీఓలు తీసుకొచ్చిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్లతో నర్సంపేటలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలని డిమాండ్ చేశారు. ఖానాపురం సొసైటీలో ఓడీసీఎంఎస్ చైర్మన్ అవినీతి బాగోతాన్ని త్వరలోనే బయటపెడతామని చెప్పారు. బార్దాన్ లోడుతో వచ్చిన లారీని దిగుమతి చేయకుండా ఎక్కడకు పంపించారో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. వ్యవసాయం అంటే తెలియని, ఎంపీటీసీ పరిధిలో రోడ్లు కూడా పూర్తి చేయలేని ఎంపీపీ విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. పనుల రద్దు, అభివృద్ధి విషయమై ఖానాపురం చౌరస్తాలో చర్చకు తాము సిద్ధమన్నారు. తేదీ, సమయం ఖరారు చేసి చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో ఎంపీటీసీ పూల్‌సింగ్, నాయకులు ముస్తఫా, ఎలగందుల రాజు, విద్యాసాగర్‌రావు, శ్రీను, వల్లె రవి, నర్సింహ, అజ్మీర రాజు, భానుప్రసాద్, రాములు, వేణుగోపాల్, వల్లె శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

వేడుకగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సంగెం : నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



దుగ్గొండి : పూర్వవిద్యార్థులు

సంగెం : మండలంలోని లోహిత గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని వేడుకగా నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులందరూ అదే పాఠశాలలో కలుసుకుని నాటి ఉపాధ్యాయులైన శ్రీరామ్మూర్తి, కుమారస్వామి, నర్సయ్య, వీరస్వామి, భిక్షపతి, దయామణి తదితరులను ఘనంగా సన్మానించి దీవెనలు తీసుకున్నారు. పాఠశాలలో తాము గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఒకరికొకరు తమ ఉద్యోగం, కుటుంబం, ఇతరత్రా వివరాలు చెప్పి స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

అపూర్వ సమ్మేళనం

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2007–08 విద్యాసంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 16 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. చిన్నప్పటి తరగతి గదులను పరిశీలించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పర్లపెల్లి ప్రతాప్, కందికొండ రాజు, కుడుతాల నిషాంత్, ముప్పారపు రాజు, ఊరటి ప్రతాప్, ఇల్లందుల నాగరాజు, భార్గవి, శ్వేత, కల్పన, కీర్తన, అనిత, శ్రావణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక రాజకీయాలు సిగ్గుచేటు

దుగ్గొండి : కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో ఎల్లబోయిన రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల రుణమాఫీ, పంట ఉత్పత్తులపై బోనస్, తదితర అనేక హామీలు గుప్పించి రైతుల ఓట్లు దండుకుని గద్దెనెక్కిందని తెలిపారు. అధికారం చేపట్టిన నాలుగు నెలలు గడచినా రైతుల సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. రైతుల ఓట్లతో గెలిచి వారికి అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొంరయ్య, మహ్మద్ రాజాసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ సమీపంలో ఎన్‌ఆర్‌ఐ పాల నరేశ్ అతడి కుమారుడు శ్రీమాన్ ఆనంద్ జన్మదిన నేపథ్యంలో సొంత డబ్బుతో నిర్మించిన గోశాలను అతడి తల్లిదండ్రులు చంద్రకళ–శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేశ్ తల్లిదండ్రులు చంద్రకళ–శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. సుమారు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన గోశాలకు కొంత స్థలాన్ని స్థానిక పూజారి సమకూర్చాడని తెలిపారు. కార్యక్రమంలో పూజారులు శ్రీనివాసాచారి, రామాచారి, ఫణీందర్, విష్ణు, సత్యనారాయణ, రాజగోపురం నిర్మాణ అధ్యక్షుడు వెంకటగిరి, సాయిలి ప్రభాకర్, వీరాటి స్వర్ణ రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సందీప్



దుగ్గొండి : మండలంలోని మైసంపల్లి గ్రామానికి చెందిన ఈర సందీప్ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సందీప్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సందీప్ మీడియాతో మాట్లాడారు. తన నియాయకానికి సహకరించిన నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ రాణాప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ పిలుపులను విజయవంతం చేస్తామన్నారు. బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు.

మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య




సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నర్సంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ చిత్తుగా ఓడించాలని, వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య కోరారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ఎన్నికల సందర్భంగా రైతులకు గిట్టుబాటు ధర, నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విదేశాలలో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి దేశంలోని పేదలకు రూ.15 లక్షలు చొప్పున పంపిణీ, తదితర అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం అన్నిటినీ విస్మరించిందని విమర్శించారు. ప్రతిపక్షాల నాయకులపై ఈడీ, సీబీఐ, ఐటీ, తదితర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి అక్రమంగా కేసులు బనాయించి జైలు పాల్జేస్తోందని చెప్పారు. మళ్లీ అధికారంలోకి రాగానే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీ అగ్రనేతల వ్యాఖ్యలను ప్రజలు గమనించాలని సూచించారు. బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని తీసుకొచ్చేలా ప్రయత్నిస్తున్న బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, అనంతగిరి రవి, పట్టణ కమిటీ సభ్యులు గద్దమీది బాలకృష్ణ, కందికొండ రాజు, ఫరీదా, రుద్రారపు లక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

సంగెం : ఐక్యఉద్యమాలతోనే రైతుల సమస్యలు పరిష్కారమౌతాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈనెల 26న వరంగల్ శివారులోని అబ్బనికుంటలో తలపెట్టిన జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. పాలకుల తప్పుడు విధానాల కారణంగా రైతులు పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీ సైతం కట్టలేక, కుటుంబాలను పోషించుకోలేక వేదనకు గురౌతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలు రైతులను ఆదుకునేలా లేవని ఆందోళన వెలిబుచ్చారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న రైతులను అణచివేస్తుండడం దారుణమని చెప్పారు. పంట ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులతోపాటు పంట రుణాలివ్వాలని, కల్తీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుని వ్యవసాయాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పాలకుల తీరుపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా కోశాధికారి సీర్ల రవీందర్, సభ్యుడు బోనాల గోపాల్, మండల నాయకులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు తగినన్ని సీట్లు ఇవ్వాలి

నర్సంపేట : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యాదవ కులానికి చెందిన నాయకులకు తగినన్ని సీట్లు ఇవ్వాలని యాదవ కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. పట్టణంలో జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాజుయాదవ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో రాములు మాట్లాడారు. రాష్ట్రంలో 20 శాతం ఉన్న యాదవులకు రాజకీయ పార్టీలు తగిన సీట్లు ఇవ్వాలని ఆకాంక్షించారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యాదవులను ఆదుకోవాలని, కార్పొరేషన్ పదవులు, నామినేటెడ్ పోస్టులు యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమ్ము రమేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తోకల కుమార్, నాయకులు బోళ్ల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు



నెక్కొండ : బెల్ట్‌షాపులకు మద్యం విక్రయిస్తే వైన్ షాపులపై చర్యలు తప్పవని ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని రెడ్లవాడ, నెక్కొండ, పనికర, అలంకానిపేట, పెద్దకొర్పోలు, చిన్నకొర్పోలు గ్రామాల్లో బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ ఎస్సై శ్రావణి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సుమారు రూ.46 వేల 290 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అలాగే మండల కేంద్రంలోని పలు వైన్‌షాపులను నర్సంపేట ఎక్సైజ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు, బెల్ట్‌షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై శ్రావణి హెచ్చరించారు.